# సేల్స్‌గాళ్

- బి. శ్రీప్రసాద్

"ఏం కావాలి సార్?" చిరునవ్వు నవ్వుతూ ప్రశ్నించింది సేల్స్‌గాళ్.

రాజారాం తలెత్తి ఆమెవైపు చూసాడు. దగ్గర దగ్గరగా ఇరవై ఏళ్లుంటాయి. అద్భుతమైన అందగత్తె అని చెప్పలేంగానీ ఆకర్షణీయంగా వుంది.

చాయనఛాయ రంగు, నవ్వితే తళుక్కుమని మెరిసే చక్కని పలువరుస. ముఖ్యంగా చూపరులను ఇట్టే కట్టిపడేసే శరీరాకృతి.

రాజారాం ఆమెవైపు నడిచాడు. ఈమధ్యకాలంలో అన్నిరకాల షాపులలో ఎక్కువ భాగం సేల్స్‌గాళ్సే వుంటున్నారు. కస్టమర్లను ఆకర్షించడానికి ఇదో పథకం.

సేల్స్‌గాళ్స్‌వల్ల ఆడ కస్టమర్లకు ఇబ్బంది వుండదు. మొహమాటపడకుండా తమకు కావలసినవేవో అడిగి కొనుగోలు చేసుకోగలరు.

మరి మగ కస్టమర్లయితే అందమైన సేల్స్‌గాళ్స్ ఉంటే చొంగ కార్చుకుంటూ షాపుకొస్తారు. రాజారాంకి సేల్స్‌గాళ్స్‌పై సదభిప్రాయంలేదు. అతని దృష్టిలో వాళ్లంతా వ్యభిచారుల కిందే లెక్క. వాళ్లకు పెద్దగా చదువుసంధ్యలుండవు. బైట తిరుగుళ్లకు అలవాటుపడి ఇంట్లో ఖాళీగా ఉండలేక డ్రెస్సులకు, మేకప్ సామానులకు, సినిమా ఖర్చులకు డబ్బు సంపాదించుకోవడం కోసం ఏ వెయ్యికో, పదకొండు వందలకో ఏదో ఒక కొట్లో సేల్స్‌గాళ్స్‌గా చేరుతారు. కొద్దిరోజుల నీతిగానే వుంటారు. ఒకసారి రుచి మరిగాక డబ్బాశ పెరగడం, యజమానులు మొహమాటాలు వాళ్లను తప్పుదోవ తొక్కిస్తాయి. ప్రతి తప్పుకు ప్రత్యేక ప్రతిఫలం లభిస్తుండడంతో పూర్తిగా తప్పుదోవకే అలవాటుపడిపోతారు. కొందరు సేల్స్‌గాళ్స్ అయితే యజమానిని ఊరించి లొంగదీసుకుని మెళ్లో తాళి కూడా కట్టించుకుని ఆ షాపుకే యజమానురాళ్లయిపోతారు. మరికొందరు తాళిని వేరొకడి చేత కట్టించుకున్నా యజమానికి అనధికారిక భార్యగా వుంటూ పెద్ద మొత్తంలో డబ్బు గుంజేస్తూ వుంటారు.

అదీ రాజారాంకు సేల్స్‌గాళ్స్ మీద ఉండే అభిప్రాయం.

* * *

"ఏం కావాలి సార్?" మరోసారడిగింది సేల్స్‌గాళ్స్.

'బాగా కండపుష్టితో బింకంగా వున్నావ్. నువ్వే కావాలి' అందామనిపించింది రాజారాంకి. కానీ అలా అనలేదు. సంస్కారం అడ్డొచ్చింది.

మన విజ్ఞాన శాస్త్రవేత్త ఫ్రాయిడ్ చెప్పినట్లు ప్రతి మనిషి లోపల వేరే మనుషులుంటారు. వాడిని సాంఘిక శక్తులు తొక్కి పెట్టడంవలన పైకి వేరే విధంగా ప్రవర్తిస్తుంటారు. అది ఆ క్షణంలో రాజారాం విషయంలో నిజమైంది.

ఆమె మరోసారి 'ఏం కావాలి సార్?' అని అడిగేలోపు "షేవింగ్ క్రీమ్, షేవింగ్ బ్రష్ కావాలి" అన్నాడు.

"షేవింగ్ క్రీమ్ ఏది ఇమ్మంటారు సార్?"

"గాడ్రేజ్ క్రీమ్ ఇవ్వు. అదే నేను వాడేది."

ఆమె క్షణాలలో అతనికి షేవింగ్ క్రీమ్ అందించింది. దాంతోపాటు నాలుగైదు రకాల షేవింగ్ బ్రష్‌లను కూడా చూపెట్టింది. ఆ బ్రష్‌ల వెలలు చెప్తూ నాణ్యత, మన్నికలను వివరించింది.

ఆమె చేతిలోవున్న బ్రష్‌లను పరిశీలించేందుకు అందుకున్నట్లుగా అందుకుంటూ ఆమె చేతివేళ్లను పట్టుకున్నాడు. ఆమె అదేం పెద్దగా పట్టించుకోలేదు.

'పిట్ట మరీ ముదురు కేసులా వుంది. ఎంతమందిని బుట్టలో వేసుకుందో' అనుకున్నాడు రాజారాం.


రెండు మూడు నిముషాలు బ్రష్‌లన్నీ పరిశీలించి ఓ బ్రష్ ఎంచుకున్నాడు.

ఆమె ఆ బ్రష్‌ను, షేవింగ్ క్రీమ్‌ను ఓ పాలిథిన్ కవర్‌లో వేసి అతనికి అందిస్తూ "థాంక్యూ సార్" అంది చిరునవ్వు నవ్వుతూ.

'పడితే ఇలాంటి పిట్టను పట్టాలి' అనుకుంటూ కాష్ కౌంటర్‌లో డబ్బు చెల్లించి వెలుపలకు నడిచాడు రాజారాం.

* * *

"నమస్తే బాబుగారూ!" అని వినిపించేసరికి



నడుస్తున్నవాడు ఆగి పక్కకు చూసాడు రాజారాం. అతనికి చిరునవ్వు నవ్వుతూ వరహాలు కనిపించాడు. వరహాలుకు యాభై ఏళ్ళుంటాయి. మనిషి బక్కపలుచగా ఉంటాడు. గడ్డం మాసి, దుస్తులు నలిగి ఉండడంతో మరో నాలుగైదు సంవత్సరాలు పైబడ్డట్లుంటాడు.

అతను రాజారాం పనిచేసే కంపెనీలోనే స్వీపర్‌గా పనిచేస్తుండేవాడు. అప్పుడతను బాగా తాగుబోతు. డ్యూటీ టైంలో కూడా తాగి ఆఫీసర్ల చేత అనేకసార్లు చీవాట్లు తిన్నాడు.

ఒకరోజు తాగి రోడ్లో నడుస్తూ కారు కింద పడ్డాడు. ఆ యాక్సిడెంట్‌లో చచ్చుండేవాడేకానీ గట్టి ప్రాణం కాబట్టి బతికి బయటపడ్డాడు. కానీ శరీర పటుత్వం పూర్తిగా కోల్పోయాడు. అలాంటి వాడిని కూర్చోబెట్టి జీతమివ్వడం ఏ కంపెనీ ఉపేక్షిస్తుంది. అందుకే అతనికివ్వాల్సిన డబ్బుతోపాటు ఒక నెల జీతం ఇచ్చి నిర్దాక్షిణ్యంగా పనిలోంచి తీసేసారు. ఇది జరిగి సంవత్సరం దాటుతోంది.

"ఏం వరహాలు బాగున్నావా?" అడిగాడు రాజారాం.

బాగానే వున్నట్లు తలాడించాడు వరహాలు.

"ఆరోగ్యమెలా వుంది?"

"ఫర్లేదు బాబూ"


"తాగుడు మానేసావా?"

"ఆ... అది ఆ రోజుతోనే సరి. ఇప్పటిదాకా చుక్కయినా తాగలేదు. ఇక దాని జోలికి పోను కూడా" స్థిరంగా చెప్పాడు వరహాలు.

"ఎక్కడైనా పనిచేస్తున్నావా?"

"లేదు బాబూ. చేయాలని ఉన్నా శరీరం సహకరించడంలేదు"

"మరి ఇల్లెలా గడుస్తుందోయ్" ఆశ్చర్యంగా





## గుర్తింపు

పెద్ద పెద్ద పాత్రలకి అలవాటు పడిన తారలు పెద్ద చిత్రాల్లో చిన్న పాత్రలు వేయడానికి జంకుతారు. అయితే నమ్రతా శిరోద్కర్ మాత్రం ఏదైతే అది అయిందనుకుంటూ ఐశ్వర్యారాయ్ నటించిన 'బ్రైడ్ అండ్ ప్రెజుడిస్' చిత్రంలో చిన్న పాత్రతో సరిపెట్టుకుంది. ఆ పాత్ర నిడివి తక్కువైనా వాసి పరంగా ఆమెకి మంచి పేరు తెచ్చిపెట్టిందట. ఈ సినిమా విడుదలయ్యాక ఆమెకి చాలా ఫోన్‌కాల్స్ వచ్చాయిట. ఈ పాత్ర మరికొద్ది సేపు ఉంటే బాగుండునేమో అని అంతా అభిప్రాయపడ్డారుట. 'పాత్ర చిన్నదైనా దాని ప్రాధాన్యతని బట్టి నటించాల్సి ఉంటుంది' అంటోంది నమ్రతా.

అడిగాడు రాజారాం.

"మా అమ్మాయి పుణ్యాన ఏదో మా అందరికీ ఐదు వేళ్ళూ నోట్లోకి వెళుతున్నాయి బాబూ"

"మీ అమ్మాయి ఎక్కడైనా పనిచేస్తోందా?"

"అవును బాబూ"

"ఏం పని?"

"అదేదో షాపు బాబూ. పేరు గుర్తులేదు. అక్కడ పనిచేస్తోంది."

"సేల్స్‌గళ్‌గానా?"

"అవును బాబూ"

'ఇక మీ కుటుంబానికి ఏ ఢోకా లేదు లేవోయ్. బాగానే సంపాదించుకుని రాగలదు' అనుకున్నాడు రాజారాం.

"సరేనోయ్ ఉంటాను" అక్కడనుంచి కదిలాడు రాజారాం.

"మంచిది బాబూ" అంటూ రెండు చేతులూ జోడించి నమస్కారం పెట్టాడు వరహాలు.

***

ఆ ఫ్యాన్సీ షాపులోకి అడుగుపెట్టిన రాజారాంకు అంతకుముందు కనిపించిన అమ్మాయి కనిపించలేదు. ఆమె స్థానంలో వేరే అమ్మాయి వుంది.

ఆమె రాజారామ్‌ను చూసి "ఏం కావాలి సార్" అంటూ చిరునవ్వు నవ్వింది.


రాజారాం జేబులోంచి చిన్న స్లిప్ ఇవతలకు తీసాడు. అందులో తనకు కావాల్సిన వస్తువులను వరుసగా వ్రాసుకున్నాడు. ఆ స్లిప్‌ను ఆమెకందించాడు. ఆ లిస్ట్‌లో రాసిన వస్తువులను వరుసగా చదువుతూ చివర రాసినదేమిటో అర్థంకాక "ఇదేంటి సార్" అని అడిగింది.

రాజారాం స్లిప్‌లోకి చూసి "బ్లేడ్స్ పాకెట్" అని చదివాడు.

"ఓకే సార్" అంటూ ఆమె ఆ వస్తువులను తెచ్చేందుకు వెళ్లింది.

రాజారాం ఇంతకుముందున్న అమ్మాయి ఏమయిందా అని ఆలోచిస్తూ షాపంతా కలియజూస్తున్నాడు.

సేల్స్‌గాళ్ ఒక్కొక్క వస్తువే తెచ్చి అక్కడ పెడుతోంది. రెండు నిముషాలలో అన్ని వస్తువులనూ తెచ్చి వాటి నన్నింటి నీ కవర్లో వేసి రాజారాంకు అందించింది.




రాజారాం ఆ వస్తువులను అందుకుంటూ "ఇంతకుముందు మరో అమ్మాయి ఉండేదికదా" అన్నాడు.

ఆ అమ్మాయి కాష్ కౌంటర్‌వైపు ఓరగా చూసింది. అక్కడున్న వ్యక్తి రోడ్డుమీద వచ్చి పోయే ఆడవాళ్లను చూస్తూ కాలక్షేపం చేస్తున్నాడు. అతను తన మాటలు వినడంలేదని నిర్ధారించుకున్నాక అందా అమ్మాయి "ఆ అమ్మాయి మానేసి నెలయింది"

"ఏం?"

"ఆమెకూ, మా ఓనర్‌కు గొడవైంది"

"ఎందుకు?"

"చాలామంది షాప్ ఓనర్ల దృష్టిలో సేల్స్‌గాళ్స్ అంటే ఉప్పుడుగత్తెల కింద లెక్క. అలాంటివాళ్లల్లో మా ఓనర్ ఒకడు. చూడండి రోడ్డుమీద వచ్చి పోయే ఆడవాళ్లను తినేసేలా ఎలా చూస్తున్నాడో? ఒకరోజు ఒళ్లు కొవ్వెక్కి ఆ అమ్మాయి చేయి పట్టుకున్నాడు. ఆ అమ్మాయి చెప్పు తీసుకుని మొహం పగలగొట్టింది. దాంతో పెద్ద గొడవైపోయింది. ఆ అమ్మాయి పనిమానేసి తన ఊరికి వెళ్లిపోయింది" గొంతు తగ్గించి మెల్లగా చెప్పిందా అమ్మాయి.

రాజారాంకు తల తిరిగిపోయింది.

"ఆ అమ్మాయి పేరేంటి?"

"వసంత"

***

"ఏమోయ్ శంకరం! చాలా హుషారుగా వున్నావు?" టీ కప్పుతో తన దగ్గరకు వచ్చిన శంకరాన్ని ప్రశ్నించాడు రాజారాం.

శంకరం, రాజారాం పనిచేసే ఆఫీసులో అటెండర్‌గా పనిచేస్తున్నాడు.

"నాకు పెళ్లి కుదిరింది సార్" అన్నాడు.

"ఇంత సంతోషకరమైన వార్త అంత తేలిగ్గా చెప్తావేమిటి? ఇంతకూ ఎప్పుడు పెళ్లి?" నవ్వుతూ అడిగాడు రాజారాం.

"పెళ్లి పైవారం సార్. మన ఆఫీసులో అందరూ తప్పక రావాలి"

"అందరి సంగతి నాకెందుకు? నేను మాత్రం తప్పక వస్తాను. ఇంతకూ అమ్మాయి ఊరు పేరు ఏమిటి? పిల్లెలా వుంటుంది? కట్నం ఎంత?" ప్రశ్నల వర్షం కురిపించాడు రాజారాం.

"అమ్మాయి పేరు దుర్గ. ఈ ఊరే. నాకైతే బాగా నచ్చింది. అందుకే కట్నం ఇవ్వలేమన్నా పెళ్లికి ఒప్పుకున్నా" చెప్పాడు శంకరం.

టీ తాగడం పూర్తిచేసి కప్పందించాడు రాజారాం. కప్పు అందుకుంటూ "పెళ్లికి తప్పక రావాలి సార్. మంచి రోజు చూసుకుని పెళ్లి పత్రికలతో వచ్చి మళ్లీ కలుస్తాను" అన్నాడు శంకరం.

"ఓ..తప్పకుండా..." అన్నాడు రాజారాం.

***

ఆ షాపు ముందు పెద్ద గొడవవుతుంటే కుతూహలంగా అటు నడిచాడు రాజారాం. ఎవరో వ్యక్తి ఆ షాపు ఓనర్ని బండబూతులు తిడుతున్నాడు. అతను తనకు సపోర్టుగా మరో ఇద్దర్ని పిలుచుకుని వచ్చినట్టున్నాడు. వాళ్ళు కూడా ఆ షాపు ఓనరుతో గొడవ పడుతున్నారు. చుట్టూరా జనం పోగయి ఉన్నారు. రాజారాం ముందుకెళ్లి చూసాడు. ఆ వ్యక్తి మరెవరో కాదు వరహాలు.

"ఏంటి వరహాలు... ఏంటి గొడవ?'' అడిగాను.

వరహాలు, రాజారాంను చూసి "చూడండి బాబూ... వీడు నా కూతురు చేయి పట్టుకోవడమే కాదు, రాత్రికి రమ్మన్నాడట. కడువు కూటికి కక్కుర్తిపడి నా కూతుర్ని వీడి అంగట్లో పనిలో పెట్టాను. పసిపిల్ల... అది వీడి చేష్టలకు భయపడిపోయి ఇంటికి పరుగెత్తుకొచ్చి జరిగింది నాకు చెప్పుకుని ఏడ్చింది. ఇలాంటి వెధవలను ఏం చేయాలో మీరే చెప్పండి'' అంటూ గొడవంతా చెప్పుకొచ్చాడు.

రాజారాం బుర్ర మరోసారి గిర్రుమంది.

'సేల్స్‌గాళ్స్ విషయంలో తన అభిప్రాయం తప్పు. ఎవరో కొందరు అలాంటి వాళ్ళుంటారు గానీ అందరూ అలాంటివాళ్ళే అయ్యుండరు. అందరినీ ఒకే గాటికి కట్టేయడం తను చేసిన తప్పు' అనుకున్నాడు.

***

రూంకి వచ్చేసరికి రాజారాంకు అర్జంటుగా రమ్మని ఇంటికి నుంచి ఉత్తరం వచ్చి వుంది. కాంటాక్ట్ చేసేందుకు అతనికి ఫోన్ లేకపోవడంతో ఉత్తరం రాసాడు అతడి తండ్రి. పెళ్లిచూపులట. పిల్ల ఇంట్లో అందరికీ నచ్చిందిట. తనువచ్చి చూసి నచ్చిందని చెబితే చాలుట... ముహూర్తాలు పెట్టించేస్తారు.

'ఇంతకూ పెళ్లి చూపులెప్పుడో' అనుకుంటూ మరోసారి ఉత్తరాన్ని చూసాడు. రేపు...అంటే తను ఈ రోజే బయలుదేరాలి ఊరికి. తనకీ విషయం ముందుగా తెలియకపోవడంవల్ల ఆఫీసులో సెలవు చెప్పి రాలేదు.

"సరేలే... మేనేజర్‌కు ఫోన్ చేసి రేపు, ఎల్లుండి ఆఫీసులో రానని చెప్పొచ్చి ఊరికి బయలుదేరచ్చు' అనుకుంటూ గదికి తాళంవేసి ఫోన్ చేయడానికి వెళ్లాడు.

అక్కడకు వెళ్ళేసరికి ఫోన్ చేయడానికి ఇద్దరు సిద్ధంగా వున్నారు. రాజారాం అక్కడున్న బల్లపై కూర్చున్నాడు. టెలిఫోన్ బూత్ అతను, అతని స్నేహితుడు మాట్లాడుకుంటున్నారు.

అక్కడంతా మగవాళ్లే ఉండేసరికి మొహమాటం లేకుండా మాట్లాడుకుంటున్నారు.

"ఏరా! రాత్రి పగలు నువ్వే కూర్చోకపోతే సాయంత్రంపూట కూచోవడానికి ఎవర్నయినా అమ్మాయిని పనిలో పెట్టుకూడదూ. నీకు అన్ని విధాలా ఉపయోగపడుతుంది''

"అన్ని విధాలా అంటే?''

"అన్ని విధాలా అంటే... అన్ని విధాలే'' నవ్వాడతను.

"అమ్మాయిలేం తేరగా లేరురా బాబూ. హద్దు దాటనంతవరకూ బాగానే వుంటారు. హద్దు మీరారంటే చెప్పు తెగేలా కొడతారు. నువ్వు చెప్పేలాంటి వాళ్ళు ఉంటారు కాదనను. కానీ అలాంటివాళ్ళు కొద్దిమందే ఉంటారు'' చెప్పాడు టెలిఫోన్ బూత్ నడిపే అతను.

అతనికున్నపాటి బుద్ధి తనకు లేనందుకు సిగ్గుపడ్డాడు రాజారాం.

***

రాజారాంకు అవే మొదటి పెళ్లిచూపులు.

అతని తల్లిదండ్రులు అతనికి ముందే చెప్పారు అమ్మాయి బాగుంటుందని, మంచి సాంప్రదాయ కుటుంబమని. అందుకే వాళ్ళు పెద్దగా ఆస్తిపరులు కాకపోయినా ఈ సంబంధాన్ని ఇష్టపడ్డారు. అంతే కాదు, అమ్మాయి సిటీలో ఎక్కడో జాబ్ చేస్తుండేదనీ, ఆమెకూ, ఓనర్‌కూ పడక పని మానుకుని వచ్చేసిందని చెప్పారు.

ఫలహారాలు పూర్తయ్యాక అమ్మాయి కాఫీ కప్పులతో వచ్చిందక్కడికి.

ఆమెను చూసి షాకయ్యాడు రాజారాం.

ఆమె మరెవరో కాదు, వసంత.

తాను ఆ రోజు షేవింగ్ క్రీమ్, బ్రష్ కొన్నప్పుడు ఆ షాపులో సేల్స్‌గాళ్‌గా పనిచేసిన అమ్మాయి.

ఆమె కూడా రాజారాంను గుర్తుపట్టినట్టుంది. అతనికి మాత్రమే కనిపించేటట్లు చిరునవ్వు నవ్వింది. ఆ రోజు సాయంత్రం బస్సెక్కేముందు తల్లిదండ్రులకు చెప్పాడు రాజారాం.

"అమ్మాయి నాకు నచ్చింది. ముహూర్తాలు పెట్టించండి''

***

పెళ్లి మండపంలో శంకరం పక్కనున్న అమ్మాయిని గుర్తుపట్టాడు రాజారాం.

ఆమె వరహాలు కూతురు.

రాజారాం వారిపై మనస్ఫూర్తిగా అక్షింతలు చల్లాడు. ★

## దండగ

"నాకు సారా, బ్రాందీ, సిగరెట్, గుట్కా, జూదం...లాంటి చెడు వ్యసనాలు ఏవీలేవు. కనీసం కాఫీ, టీ లాంటివి కూడా తాగను. ఎందుకంటే వందేళ్ళు బ్రతకాలని నా కోరిక'' అన్నాడు రామారావు తన మిత్రుడితో.

"ఈ అలవాట్లేమీ లేకుండా, ఏమీ అనుభవించకుండా వందేళ్ళు నిస్సారంగా జీవించడం శుద్ధ దండగ'' పెదవి విరిచాడు రాజారావు.

## ఫర్వాలేదు

"మీ ఆవిడ చెవులేంటి అలా వాచిపోయి వున్నాయి. డాక్టర్‌కు చూపించలేకపోయావా?'' అన్నాడు సూర్యం.

"మరేం ఫర్వాలేదు. పక్కింటి వాళ్ల మాటలు వినడానికి గోడకు చెవులు ఆనించి, ఆనించి అలా వాచిపోయాయి అంతే.''

## ఎడబాటు

"నేను పుట్టింటికి వచ్చి పదిహేను రోజులు అయింది. మీ ఎడబాటు భరించలేక చిక్కి సగమైనాను. వెంటనే మీ దగ్గరకు వచ్చేయాలనుకుంటున్నాను'' అంటూ ఉత్తరం రాసింది భార్య.

"మరో పదిహేనురోజులు అక్కడే వుండు. మిగతా సగం బరువు కూడా తగ్గాక అప్పుడు వద్దువుగాని'' భార్య స్థూలకాయాన్ని తలచుకుంటూ ఉత్తరం రాసాడు భర్త.

-గోపాల్ శ్రీహరి
(పాకాల)

